

# హైదరాబాద్‌లో జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)

ముచ్చటించారు. రాబోయే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో జనసేన పార్టీ బరిలోకి దిగుతుందని పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఇప్పటికే స్పష్టం చేశారు. ఒంటరిగానైనా సరే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో పోటీ చేస్తామని, క్షేత్రస్థాయిలో పార్టీకి బలం పెంచేందుకు త్వరలోనే తానే స్వయంగా తెలంగాణవ్యాప్తంగా పర్యటిస్తానని ఆయన ప్రకటించారు. ఈ క్రమంలోనే గ్రేటర్ ఎన్నికలను ఒక సవాల్‌గా తీసుకుని క్యాడర్‌ను సమాయత్తం చేసేందుకు ఈ నూతన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా మారిన జనసేన పార్టీ.. తెలంగాణపై తన రాజకీయ దృష్టిని కేంద్రీకరించింది. రాష్ట్రంలో పార్టీ విస్తరణ, సంస్థాగత బలోపేతమే లక్ష్యంగా సరికొత్త వ్యూహాలతో దూకుడు పెంచింది. హైదరాబాద్‌లో ఇప్పటికే జనసేన పార్టీకి కార్యాలయం ఉన్నప్పటికీ.. తెలంగాణలో పార్టీ ఉనికిని మరింత బలంగా చాటేందుకు ఈ కొత్త ఆఫీస్‌ను అందుబాటులోకి తెచ్చారు. రాష్ట్రంలో పార్టీ చేరికలను ప్రోత్సహించేందుకు వీలుగా త్వరలోనే ఒక ప్రత్యేక 'జాయినింగ్స్ కమిటీ'ని కూడా ఏర్పాటు చేయనున్నారు. ఈ కార్యాలయం కేంద్రంగానే తెలంగాణలో సంస్థాగత నిర్మాణం, కమిటీల ఏర్పాటు, ఇతర రాజకీయ వ్యూహాలపై జనసేన నాయకత్వం దృష్టి సారించనుంది.ఇటీవలి కాలంలో పవన్ కళ్యాణ్ హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్ పెట్టడం, ఢిల్లీ వేదికగా జరిగిన 'సేన ప్రస్థానం' కార్యక్రమంలో తెలంగాణ రాజకీయాల గురించి ప్రస్తావించడం, అలాగే హనుమకొండలో తన అభిమాని నిరంజన్‌ను కలవడం వంటి వరుస పరిణామాలు జనసైనికుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. ఆంధ్రప్రదేశ్‌లో సాధించిన విజయ ఉత్సాహంతో తెలంగాణలోనూ జనసేనను ఒక బలమైన ప్రత్యామ్నాయ శక్తిగా నిలబెట్టాలని పవన్ భావిస్తున్నారు. ఈ నూతన కార్యాలయం ప్రారంభోత్సవంతో తెలంగాణ రాజకీయాల్లో జనసేన తన తదుపరి పొలిటికల్ రోడ్ మ్యాప్‌ను ఎలా సిద్ధం చేసుకోబోతోందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# వాట్సాప్‌లో పాఠశాల విద్యా సేవలు ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)

నేతృత్వంలో తెలంగాణ ప్రభుత్వ సమాచార సాంకేతిక, ఎలక్ట్రానిక్స్ / కమ్యూనికేషన్స్ శాఖకు చెందిన ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ–మీసేవ విభాగం, పాఠశాల విద్యా శాఖతో కలిసి అభివృద్ధి చేసింది. విద్యార్థులు, తల్లిదండ్రులకు పారదర్శకంగా, సులభమైన రీతిలో వేగవంతమైన సేవలను అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ఈ డిజిటల్ సేవలను వినియోగించుకుంటున్నారు. వాట్సాప్ ద్వారా మీసేవ ప్రస్తుతం అందిస్తున్న ప్రధాన సేవలు ఇలా ఉన్నాయి. విద్యార్థుల ప్రోగ్రెస్ రిపోర్టులు,హాల్ టికెట్ల డౌన్‌లోడ్,మార్కుల మెమోలు,పరీక్షా ఫలితాలు,ఎస్ఎస్‌సీ మెమోలు, బోనెడ్ సర్టిఫికెట్లు,ట్రాన్స్ ఫర్ సర్టిఫికెట్లు,ఎస్ఎస్‌సీ మెమో సవరణల దరఖాస్తులు సేవల వల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గి, సమయంతో పాటు వ్యయం ఆదా అవుతోంది. త్వరలో అందుబాటులోకి రానున్న సేవలు తదుపరి దశలో క్రింది సేవలను కూడా వాట్సాప్ వేదికలో అందుబాటులోకి తీసుకురానున్నారు. యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ వివరాలు,విద్యార్థుల హాజరు సమాచారం,ప్రీ–మెట్రిక్ స్కాలర్‌షిప్ దరఖాస్తులు,మధ్యాహ్న భోజన పథకం వివరాలు,ఆరోగ్య, సంక్షేమ కార్యక్రమాలు,క్రీడలు, సహపాఠ్య కార్యక్రమాల సమాచారం, రెసిడెన్షియల్ పాఠశాలల సంక్షేమ కార్యక్రమాల వివరాలు,విద్యార్థులు, తల్లిదండ్రుల అభిప్రాయ సేకరణ ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా రాష్ట్ర పక్షి 'పాలపిట్ట'ను డిజిటల్ మస్కట్‌గా పరిచయం చేశారు. పాలపిట్ట యానిమేషన్ వీడియోల ద్వారా విద్యార్థులు, తల్లిదండ్రులకు ముఖ్యమైన సమాచారం, అవగాహన సందేశాలు, వీడియోలు వాట్సాప్‌లో పంపించబడతాయి. దీనివల్ల ప్రభుత్వ విద్యా సమాచార ప్రసారం మరింత సులభంగా, ఆకర్షణీయంగా, ప్రజలకు చేరువ అవుతుంది. సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, విద్యా రంగంలో సాంకేతికత వినియోగాన్ని మరింత విస్తరించి విద్యార్థుల అభ్యాస ఫలితాలను మెరుగుపరచడం, తల్లిదండ్రులతో ప్రభుత్వ అనుసంధానాన్ని బలోపేతం చేయడం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రజలకు చేరువైన, సమర్థవంతమైన డిజిటల్ సేవల అందింపులో తెలంగాణ మరోసారి దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. వాట్సాప్ ఆధారిత పాఠశాల విద్యా సేవల ప్రారంభం తెలంగాణ డిజిటల్ పరివర్తన ప్రయాణంలో మరో ముఖ్యమైన మైలురాయిగా నిలవనుంది.

# ఇన్‌స్టా ఫేక్ ఐడీతో మోసం..

## యువతి నుంచి లక్షలు కాజేసిన నిందితుడు

**టేక్మాల్:** సోషల్ మీడియా వేదికగా పరిచయమై.. ప్రేమ, పెళ్లి పేరుతో నమ్మించి యువతుల వద్ద నుంచి లక్షలాది రూపాయలు, బంగారాన్ని కాజేసిన ఓ మోసగాడి ఉదంతం వెలుగులోకి వచ్చింది. ఇన్‌స్టాగ్రామ్‌లో నకిలీ ఐడీలతో అమ్మాయిలకు వల విసిరి, లక్షల్లో సొమ్ము వసూలు చేసిన ఓ కేటుగాడిపై బాధితురాలు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులకు అందిన ఫిర్యాదు వివరాల ప్రకారం... మెదక్ జిల్లా టేక్మాల్ మండలం, ఎల్లంపల్లి గ్రామానికి చెందిన కొండి స్వాతికి ఏడాది క్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో ఫాలో రిక్వెస్ట్ వచ్చింది. దాంతో వారిద్దరి మధ్య పరిచయం ఏర్పడింది. సదరు వ్యక్తి తాను ఐపీఎస్ ట్రైనింగ్ కోసం ఛత్తీస్‌గఢ్ వెళ్తున్నానని.. అది పూర్తి కాగానే పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. ఆ తర్వాత కొన్ని రోజులకు అర్జెంట్‌గా డబ్బులు కావాలని, తన స్నేహితుడైన ఉప్పరి దుర్గేశ్ వస్తాడని, అతనికి డబ్బులు ఇవ్వాలని ఆమెను నమ్మించాడు. అతని మాటలు నమ్మిన బాధితురాలు విడతల వారీగా నగదు రూపంలో, ఫోన్ పే ద్వారా మొత్తం రూ.5లక్షలతో పాటు తులం చెవి కమ్మలను దుర్గేశ్‌కి అందజేసింది. డబ్బులు తీసుకున్న తర్వాత సదరు మోసగాడి నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ఏడాది దాటినా రాకపోవడంతో అనుమానం వచ్చిన స్వాతి తాను మోసపోయానని గ్రహించింది. ఇదే తరహాలో మరెవరినైనా మోసం చేశాడా అని ఆరా తీయగా షాకింగ్ నిజాలు బయటపడ్డాయి. టేక్మాల్ మండలం ఎక్లాస్ పూర్ గ్రామానికి చెందిన 17ఏళ్ల యువతికి కూడా ఇన్‌స్టాగ్రామ్‌లో నకిలీ ఐడీ నుండి రిక్వెస్ట్ వచ్చింది. తాను ఎంబీబీఎస్ స్టూడెంట్ అని పరిచయం చేసుకున్న సదరు కేటుగాడు, ఆమెకు డైమండ్ రింగ్ పంపిస్తున్నానని, దానికి టాక్స్ కట్టాలంటూ నమ్మించాడు. తన స్నేహితుడు దుర్గేశ్ వస్తాడని చెప్పి, ఆమె వద్ద నుంచి కూడా రూ. 7లక్షల నగదు, ఒక తులం బంగారు ఉంగరాన్ని దుర్గేశ్ ద్వారా వసూలు చేశాడు. ఈ మొత్తం వ్యవహారం వెనుక ఉప్పరి దుర్గేశ్ కీలక పాత్రధారి అని తేలింది. అతడే ఇన్‌స్టాగ్రామ్‌లో నకిలీ ఐడీలు సృష్టించాడు. తానే పెద్ద పెద్ద ఉద్యోగాలు చేస్తున్నట్లుగా నమ్మించి, పెళ్లి పేరుతో ఇద్దరు యువతులను మోసం చేశాడని పోలీసులు గుర్తించారు. ఈ మేరకు టేక్మాల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# తరగతి గదుల్లో దేశ భవిష్యత్

(మొదటిపేజీ తరువాయి)

పాలనా సౌలభ్యం కోసమో ఏర్పడింది కాదని ఈసందర్భంగా అన్నారు. 60 ఏళ్ల సుదీర్ఘ పోరాటం, విద్యార్థుల ఆత్మబలిదానాలతో ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైంది. తెలంగాణ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు, ఉపాధి కోసం ఎంతోమంది త్యాగాలు చేశారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో ఉంది.. వాటిని పునరుద్ధరించాలన్నదే తన సంకల్పమని అన్నారు. విద్యాశాఖను గతంలో విధ్వంసం చేశారు. గత పాలకుల అరాచకంతో రాష్ట్రానికి వందేళ్ల నష్టం జరిగింది. తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీ రూపొందించి ప్రక్షాళన చేపట్టాం అని వివరించారు. విధ్వంసమైన విద్యాశాఖను వికాసం వైపు నడిపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం బడ్జెట్‌లో 8.5 శాతం నిధులు కేటాయించాం. వెనుకబడిన తరగతుల విద్యార్థుల కోసం రూ.26,600 కోట్లు ఖర్చు చేస్తున్నాం. వీటిని భావితరాల భవిష్యత్తును నిర్ణయించే పెట్టుబడులుగా భావిస్తున్నాం. ఆరుట్లలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో నో అడ్మిషన్ బోర్డు పెట్టారు. ప్రభుత్వ స్కూళ్లలో ఇలా బోర్డు పెట్టే పరిస్థితి వస్తుందని ఎవరూ ఊహించి ఉండరని అన్నారు. ఉద్యోగులకు జీతాల మాదిరిగానే ప్రతినెలా ఒకటో తేదీన విద్యార్థులకు కాస్మోటిక్ ఛార్జీలు చెల్లిస్తున్నామని రేవంత్‌రెడ్డి అన్నారు. గతంలో హాస్టల్ విద్యార్థులకు ఈ ఛార్జీలు పెంచలేదని, తాము అధికారంలోకి వచ్చాక పెంచామని అన్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్‌తో పాటు మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపనల, ప్రారంభోత్సవాలు

ఎల్బీ స్టేడియంలో యంగ్ ఇండియా వెల్కమ్ కిట్స్ పంపిణీ, డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని తెలంగాణ ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులతో డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించడంతో పాటు కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. తెలంగాణ వ్యాప్తంగా రూ.50.73కోట్లతో క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి సీఎం రేవంత్ శ్రీకారం





చుట్టారు. అందులో రూ.36.65కోట్లతో వివిధ జిల్లాల్లో మినీ స్టేడియాల నిర్మాణం, క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి శంకుస్థాపన చేశారు. రూ.14.08కోట్లతో గచ్చిబౌలి, ఎల్బీ స్టేడియాల్లో బాలబాలికల క్రీడా శిక్షణకు వివిధ అకాడమీలను రేవంత్ ప్రారంభించారు. రూ.10కోట్లతో రంగారెడ్డి జిల్లా కొందుర్గ్‌లో మినీ స్టేడియం నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. రూ.10కోట్లతో సంగారెడ్డిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియం ఆధునికీకరణకు కొబ్బరికాయ కొట్టారు. అలాగే రూ.4కోట్లతో నారాయణపేట్ జిల్లా నర్వలో మినీ స్టేడియం నిర్మాణానికి భూమిపూజ చేశారు. రూ.4కోట్లతో వనపర్తి జిల్లా ఆత్మకూర్‌లో మల్టీ పర్పస్ స్టేడియం, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో కోర్టుల నిర్మాణం, క్రికెట్ గ్రౌండ్, వాకింగ్ ట్రాక్ అభివృద్ధికి శంకుస్థాపన చేశారు. అలాగే రూ.3.50కోట్లతో కామారెడ్డి జిల్లా గాంధారి, రూ.2.65కోట్లతో మెదక్ జిల్లా నర్సాపూర్‌లో మినీ స్టేడియాలకు భూమిపూజ చేశారు. రూ.2.50కోట్లతో నారాయణపేట్ జిల్లా మక్తల్ మండలం ఉట్కూరులో వాలీబాల్, కబడ్డీ కోర్టుల నిర్మాణానికీ కొబ్బరికాయ కొట్టారు సీఎం రేవంత్. రూ.5.70 కోట్లతో బాలికల కోసం హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన ఈఎఈం తెలంగాణ టాలెంట్ అకాడమీ ప్రారంభం చేశారు. రూ.5.70 కోట్లతో బాలుర కోసం గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన ఈఎఈం తెలంగాణ టాలెంట్ అకాడమీ ప్రారంభించారు. రూ.35.95 లక్షలతో బాలికల కోసం గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన అథ్లెటిక్స్ అకాడమీ ప్రారంభం అయ్యింది. రూ.35.94 లక్షలతో బాలుర కోసం గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన అథ్లెటిక్స్ అకాడమీ ప్రారంభం చేశారు. రూ.44.50 లక్షలతో బాలికల కోసం గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన హాకీ అకాడమీ ప్రారంభం చేశారు. రూ.44.50 లక్షలతో బాలుర కోసం గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన హాకీ అకాడమీ ప్రారంభం అయ్యింది. రూ.58.50 లక్షలతో బాలుర కోసం ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఫుట్ బాల్ అకాడమీ ప్రారంభం చేశారు. రూ.49 లక్షలతో బాలుర కోసం ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన హ్యాండ్ బాల్ అకాడమీ ప్రారంభం అయ్యింది. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి, గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. మరోవైపు గురుకుల విద్యార్థులకు 22 రకాల వస్తువులు, హాస్టల్ విద్యార్థులకు 10, డే స్కాలర్లకు 7 రకాల విద్యా సామగ్రితో కిట్లను అందించారు. ఈ కార్యక్రమానికి సుమారు 15వేల మంది విద్యార్థులు హాజరయ్యారు.

# కేంద్రం నిర్ణయం మేరకే పంటలను కొంటారా?

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విషం కక్కారని మండిపడ్డారు. శుక్రవారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వరంగల్‌లో రాహుల్ గాంధీ రైతు డిక్లరేషన్ ప్రకటించారని గుర్తు చేశారు. ఆయన జన్మదినం రోజే ఆ డిక్లరేషన్‌ను తెలంగాణ సీఎం బొందపెట్టారని హరీశ్ రావు విమర్శించారు. ధాన్యం ఏదైనా కనీస మద్దతు ధరతోపాటు బోనస్ కూడా ఇస్తామని నాడు రాహుల్ గాంధీ వరంగల్ వేదికగా ప్రకటించారని గుర్తు చేశారు. కానీ అందుకు భిన్నంగా కేంద్రం చెప్పిందే కొంటాం.. ఎంత కొనమంటే అంతే కొంటామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే తెలిపారు. తన బాధ్యత నుంచి తప్పించుకుంటుందంటూ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం కొన్నా కొనకపోయినా.. అన్ని పంటలు కొన్నది కేసీఆర్ ప్రభుత్వమని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. తన నిర్ణయం మార్చుకోవాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్ చేశారు. కేంద్రం ఎంఎస్‌పి ప్రకటిస్తుంది తప్ప మక్కలూ, జొన్నలు కొనదా? అని అసహనం వ్యక్తం చేశారు. పప్పు దినుసులు, వేరుశనగ 25 శాతం మాత్రమే కేంద్రం కొనుగోలు చేస్తుందన్నారు. అంటే మిగతా పంటను రైతులు బయట అమ్ముకోవాలా? అని ప్రభుత్వాన్ని ఆయన నిలదీశారు. దళారుల దయాదక్షిణ్యంపై రైతులు ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొందని హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. 50 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కేంద్రం కొంటుందని.. మిగతా పంటను రైతులు ఏం చేయాలని ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలంటున్న రైతులకు ప్రభుత్వం భరోసా ఇస్తుందా అని అడిగారు. తడి గుడ్డతో రైతుల గొంతును రేవంత్ రెడ్డి ప్రభుత్వం కోస్తుందన్నారు. రైతులు జీవితాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెలగాటం ఆడుతున్నాయన్నారు. ఎకరాకు రెండు బస్తాల యూరియా మాత్రమే.. అదీ నెలకు ఒకటి చొప్పున ఇస్తారట అంటూ ఆయన ఆందోళన చెందారు. రైతులంటే మీకు ఎందుకు ఇంత చిన్నచూపు అని మంత్రులను ఆయన ప్రశ్నించారు. యూరియా ఇచ్చే తెలివి కూడా లేదా అని ప్రభుత్వాన్ని నిలదీశారు. మిర్చి రైతులు ఎకరాకు ఐదారు యూరియా బస్తాలు వాడుతారని.. మరి మీరు రెండే ఇస్తే మిగతాది ఎట్లా అని ప్రశ్నించారు. కేంద్రం 30 శాతం యూరియా ధరలు పెంచిందని వివరించారు. రెండు బస్తాల ఆలోచన విరమించుకోవాలని ప్రభుత్వానికి ఆయన హితవు పలికారు. 45 రోజుల్లో 9 వేల కోట్ల రూపాయిల రైతు బంధు ఇస్తామ న్నారని.. 90 రోజులు అయ్యిందని.. ఇప్పటికీ రైతుల ఖాతాల్లో నగదు మొత్తం పడలేదని విమర్శించారు. ఎకరాకు రూ.15 వేలు అన్నారని చెప్పారు. 2024–25 వానాకాలం పంటకు ఒక్క రూపాయి ఇవ్వలేదని.. పూర్తిగా ఎగ్గొట్టారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం మొత్తం 5 పంటలకు రైతులకు రూ.29,358 కోట్లు బకాయి పడ్డిందని అన్నారు. రైతు బీమా ఆగలేదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల చెప్పారని గుర్తు చేశారు. మరి ఈ ఏడాది జనవరి నుంచి నేటి వరకు రైతు బీమా ఆగిందా? లేదా చెప్పాలని మంత్రులను ఆయన బల్ల గుద్ది ప్రశ్నించారు. దీనిపై చర్చకు ఏ ఊరుకైనా పోదాం వస్తారా అని మంత్రులకు ఆయన సవాల్ విసిరారు. మొత్తం రాష్ట్రంలో 7,600 మందికి బీమా రాలేదని గణాంకాలతో సహా హరీశ్‌రావు వివరించారు. ఎందుకు భీమా రావడం లేదంటే.. ప్రభుత్వం ప్రీమియం కట్టలేదన్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో గురువారం మీరు కేబినెట్‌లో చేసిన తీర్మానాన్ని ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. అన్ని పంటలు యథావిధిగా కొనుగోలు చేయాలని ప్రభుత్వానికి స్పష్టం చేశారు. తప్పుడు నిర్ణయం తీసుకున్నందుకు రైతులకు క్షమాపణ చెప్పాలని రేవంత్ సర్కార్‌ను హరీశ్ రావు డిమాండ్ చేశారు.

# ధాన్యం నిల్వ వ్యవస్థ ఆధునీకరణకు చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

అత్యాధునిక సైలోల ఏర్పాటుపై ప్రభుత్వం పరిశీలన చేస్తున్నట్లు వెల్లడించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో శుక్రవారం ధాన్య నిల్వ, రవాణా రంగానికి చెందిన ప్రముఖ సంస్థల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో వరి ఉత్పత్తి, ధాన్యం కొనుగోళ్లు ప్రతి ఏడాది పెరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిల్వ సామర్థ్యాలను కూడా పెంచాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. అందులో భాగంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సైలోల ఏర్పాటును ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. ప్రారంభ దశలో 50 వేల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యంతో సైలోల నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేసే అవకాశాలను అధ్యయనం చేస్తున్నామని చెప్పారు. సైలోలు ప్రస్తుతం అమలులో ఉన్న ధాన్యం కొనుగోలు, నిల్వ వ్యవస్థలకు ప్రత్యామ్నాయం కాదని, వాటికి అనుబంధంగా పనిచేసే ఆధునిక మౌలిక వసతులుగా ఉపయోగపడతాయని స్పష్టం చేశారు. 'తెలంగాణలో రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లలో స్వయం సహాయక సంఘాలు, ఐకేపీ కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. భవిష్యత్తులో కూడా వారి పాత్ర కొనసాగుతుంది. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రస్తుత కొనుగోలు వ్యవస్థను కొనసాగిస్తూనే ఆధునిక సాంకేతికతను అనుసంధానం చేస్తాం' అని మంత్రి తెలిపారు. పంట కోతల అనంతరం నిల్వ నష్టాలను తగ్గించడం, ధాన్యం నాణ్యతను పరిరక్షించడం, రవాణా వ్యవస్థను వేగవంతం చేయడం, సరఫరా గొలుసును మరింత సమర్థవంతంగా మార్చడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని ఆయన చెప్పారు. సమావేశంలో పాల్గొన్న సాంకేతిక నిపుణులు ఆధునిక సైలోల ద్వారా ధాన్యం స్వీకరణ నుంచి నిల్వ, రవాణా వరకు మొత్తం ప్రక్రియను ఆటోమేటెడ్ పద్ధతిలో నిర్వహించవచ్చని



వివరించారు. డిజిటల్ నాణ్యత పరీక్షలు, యాంత్రిక అన్‌లోడింగ్, సెన్సార్ ఆధారిత పర్యవేక్షణ, శాస్త్రీయ నిల్వ విధానాల ద్వారా ధాన్య నాణ్యతను దీర్ఘకాలం కాపాడవచ్చని తెలిపారు. కొనుగోలు కేంద్రాలు, నిల్వ కేంద్రాల వద్ద ఎదురవుతున్న కార్మికుల కొరత, రవాణా ఆలస్యం వంటి సమస్యలకు కూడా ఈ వ్యవస్థ సమర్థవంతమైన పరిష్కారం చూపగలదని మంత్రి అభిప్రాయపడ్డారు. ల్గ÷ల్వే అనుసంధానంతో కూడిన ఆధునిక లాజిస్టిక్స్ వ్యవస్థ ద్వారా ధాన్యాన్ని రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు, దేశవ్యాప్తంగా వినియోగ కేంద్రాలకు వేగంగా తరలించే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రధాన వరి ఉత్పత్తి జిల్లాల్లో సైలోల ఏర్పాటుకు అనువైన ప్రాంతాలు, నిల్వ సామర్థ్యాలు, పెట్టుబడి వ్యయం, అమలు విధానాలపై సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని మంత్రి సంబంధిత సంస్థలను ఆదేశించారు.'ధాన్యం కొనుగోలు, నిల్వ, రవాణా, పంపిణీ వ్యవస్థలను మరింత బలోపేతం చేసి రైతులకు, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడం ప్రభుత్వ లక్ష్యంగా సాంకేతికతను వినియోగిస్తూ వ్యవసాయ మార్కెటింగ్ వ్యవస్థను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతాం' అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

# మైనర్లు డ్రైవింగ్ చేస్తే సహించేది లేదు

(మొదటిపేజీ తరువాయి)

12 లక్షలకు పైగా విద్యార్థులు చదువుతున్నారని అన్నారు. సేఫ్ స్కూల్ ఎన్విరాన్మెంట్ క్రియేట్ చేయడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్ పాటించడం అన్నది అలవాటుగా మారాలని సూచించారు. విద్యాసంస్థల్లో ర్యాంక్స్ ఇంపార్టెంట్ కాదని.. సేఫ్ ఎన్విరాన్మెంట్ ముఖ్యమని సీపీ స్పష్టం చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో స్కూల్ బస్సు డ్రైవర్లు పట్టుబడుతున్నారని తెలిపారు. విద్యార్థులు స్కూల్‌కు ఏ విధంగా వస్తున్నారనే దానిపై స్కూల్ యాజమాన్యం వద్ద పూర్తి రూట్‌మ్యాప్ ఉండాలన్నారు. పిల్లలు పాఠశాలకు వస్తున్నారంటే.. ఏం జరిగినా స్కూల్ యాజమాన్యానిదే బాధ్యత అని తేల్చిచెప్పారు. స్కూల్ బస్సులను నడిపే డ్రైవర్స్‌పై నిఘా ఉంచాలని సీపీ సూచించారు. ట్రాఫిక్ వాలంటీర్లు, మార్షల్స్‌ను విద్యాసంస్థలు నియమించుకోవాలని అన్నారు. పిల్లలు తెలిసీ తెలియక నేరాల్లో ఇన్వాల్వ్ అవుతున్నారని.. పిల్లలపై టీచర్స్, పేరెంట్స్ పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. స్కూల్ పరిసరాల్లో ఖచ్చితంగా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. స్కూల్ పరిసరాల్లో పొగాకు ఉత్పత్తులు అమ్మడం నేరమని... అలాంటి వాటిపై పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. దేశవ్యాప్తంగా ప్రతిరోజు 45 మంది విద్యార్థులు యాక్సిడెంట్లో చనిపోతున్నారని, యాక్సిడెంట్లు మర్డర్ల కంటే ప్రమాదకరమన్నారు. అందుకే స్కూల్ విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించాలని సీపీ సజ్జనార్ వెల్లడించారు.

# ఎన్నికల హామీలను విస్మరించిన కాంగ్రెస్

(మొదటిపేజీ తరువాయి)

తిరుగుతున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర అభివృద్ధి శూన్యమైందని, కేవలం అప్పులే పెరిగిపోయాయని కేటీఆర్ ఆరోపించారు. ఈ కొద్ది కాలంలోనే ప్రభుత్వం దాదాపు 4 లక్షల కోట్ల రూపాయల అప్పు చేసిందని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలో పేదలకు ఒక్క ఇల్లు కూడా కట్టి ఇవ్వలేదు గాని, 'హైడ్రా' పేరుతో ఉన్న ఇళ్లను మాత్రం నిర్దాక్షయంగా కూల్చుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులను 'దండుపాళ్యం ముఠా'తో పోల్చిన ఆయన, ఈ ప్రభుత్వాన్ని ఒక మాఫియా నడుపుతోందని, ఆ మాఫియాలో రేవంత్ రెడ్డి ఒక పిల్ల నాయకుడు అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి మరీ దారుణంగా తయారైందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు చేయడానికి ప్రభుత్వం దగ్గర గోనెసంచులు కూడా లేవని, ఆ సంచులన్నీ ఢిల్లీకి పోతున్నాయని విమర్శించారు. రైతులకు ఇవ్వాల్సిన 'రైతుబంధు' డబ్బు బంద్ అయిపోయిందని, ఆ పైసలన్నీ రాహుల్ గాంధీ ఖాతాలో 'టింగ్ టింగ్' అని పడుతున్నాయని ఆరోపించారు. ప్రస్తుతం పరిస్థితి ఎంత దారుణంగా ఉందంటే, రైతులు ధాన్యం కుప్పలపైనే ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలకు మంచి, చెడు ఏంటో పూర్తిగా అర్థమైందన్న కేటీఆర్, కేసీఆర్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకురావడానికి ప్రజలంతా కథానాయకులు కావాలని పిలుపునిచ్చారు. మల్కాజ్‌గిరి ప్రజలు , బిఆర్ఎస్ కార్యకర్తలు ఎటువంటి రౌడీలు, గుండాలకు భయపడాల్సిన అవసరం లేదని, పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పరంగా నిలబడుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# మూసీ రివర్‌ఫ్రంట్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్

(మొదటిపేజీ తరువాయి)

హర్షం వ్యక్తం చేశారు. ప్రాజెక్టుకు పూర్తి స్థాయిలో సహకరించి, అనుమతులు మంజూరు చేసినందుకు కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర రక్షణ శాఖ , ఇండియన్ ఆర్మీకి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మూసీ నది పునరుజ్జీవనం, రివర్‌ఫ్రంట్ అభివృద్ధి విజన్‌లో గాంధీ సరోవర్ ప్రాజెక్ట్‌కు అనుమతులు రావడం ఒక కీలక మైలురాయి అని అభివర్ణించారు. బాపు ఘాట్ పరిసర ప్రాంతాలలో ఈ ప్రాజెక్ట్ పనులు ప్రారంభం కావడం వల్ల మూసీ పరివాహక ప్రాంత రూపురేఖలు మారిపోతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మూసీ నది పరివాహక ప్రాంతాన్ని కేవలం ఒక నదిలా కాకుండా.. అద్భుతమైన పర్యావరణ, సాంస్కృతిక , గొప్ప ప్రజా ఆస్తిగా మార్చడమే తెలంగాణ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా హైదరాబాద్ నగరానికి ఒక సరికొత్త పర్యాటక హంగులు తోడవుతాయని, పర్యావరణ రక్షణకు కూడా ఇది ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. కేంద్ర రక్షణ శాఖ ఇచ్చిన ఈ గ్రీన్ సిగ్నల్‌తో గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ పనులు మరింత వేగంగా ముందుకు సాగనున్నాయి.మూసీ పునరుజ్జీవం, రివర్ ఫ్రంట్ అభివృద్ధి విజన్‌లో ఇదో మైలురాయన్నారు. మూసీ పరివాహక ప్రాంతాన్ని పర్యావరణ, సాంస్కృతిక, ప్రజా ఆస్తిగా మార్చడమే లక్ష్యమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...

# అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలలో...

**"కాకతీయ పబ్లిక్ స్కూల్" విద్యార్థి "డిలోడ్ గణ్ రాజ్" ప్రతిభ.**

**అతి పిన్న వయసులో 195 కేజీలు ఎత్తిన లిఫ్టర్ గా రికార్డు సృష్టించాడు.**

**అభినందించిన పాఠశాల యాజమాన్యం సిహెచ్. రజనీకాంత్.**






**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**

ఇటీవల థాయిల్యాండ్ దేశంలోని బ్యాంకాక్ లో నిర్వహించిన అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలలో 77 దేశాల నుండి క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలలో నిజామాబాద్ పట్టణంలోని కాకతీయ పబ్లిక్ స్కూల్ లలో 6వ తరగతి చదువుతున్న గణ్ రాజ్ డిలోడ్ అనే విద్యార్థి అతి పిన్న వయసులో 195 కేజీలు ఎత్తిన లిఫ్టర్ గా రికార్డు సృష్టించాడు. ఈ సందర్భంగా శుక్రవారం కాకతీయ పాఠశాలలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గణ్ రాజ్ తండ్రి డిలోడ్ శేఖర్ మాట్లాడుతూ, గణ్ రాజ్ గతంలో హైదరాబాద్ లో 52కేజీ, 35కేజీ, 80కేజీ విభాగంలో కూడా పవర్ లిఫ్టింగ్ చేసి పది సంవత్సరాల వయసులోనే రాష్ట్రస్థాయి రికార్డు నెల కొల్పాడని అన్నారు. నిరంతర దీక్షతో సాధన చేసి న్యూ ఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో 170కేజీలు ఎత్తి జాతీయ స్థాయి రికార్డు సృష్టించాడని అన్నారు. ఇటీవల బ్యాంకాక్ లో 77 దేశాల పవర్ లిఫ్టర్ లు పాల్గొన్న ఈ పోటీలో 195కేజీలు పవర్ లిఫ్టింగ్ చేసి రికార్డ్ సృష్టించాడని అన్నారు. గణ్ రాజ్ ను ఎప్పటికప్పుడు ప్రోత్సహించిన కాకతీయ విద్యా సంస్థల యాజమాన్యానికి డిలోడ్ శేఖర్ కృతజ్ఞతలు తెలిపారు.

**కాకతీయ విద్యా సంస్థల డైరెక్టర్ సిహెచ్. రజనీకాంత్ మాట్లాడుతూ...**

సామాన్య కుటుంబంలో నుండి వచ్చిన గణ్ రాజ్ పట్టుదలతో విశేష కృషి చేసి మన నిజామాబాద్ జిల్లాపేరు, తల్లిదండ్రుల పేరు, కాకతీయ పాఠశాల పేరు నిలబెట్టాడని అన్నారు, నేటి యువత చెడువ్యసనాలకు లోనవకుండా కెరీర్ పైన దృష్టిపెట్టి కష్టపడితే ఏ రంగంలో నైనా రాణిస్తారని, గణ్ రాజ్ విజయమే అందుకు నిదర్శన మని రజనీ కాంత్ అన్నారు. గతంలో కాకతీయ విద్యార్థి నిఖత్ జరీన్ లాగా దిలోడ్ గణ్ రాజ్ కూడా ఎదుగుతాడని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గణ్ రాజ్ తల్లిదండ్రులను, గణ్ రాజ్ ను కాకతీయ విద్యా సంస్థల డైరెక్టర్ సి. హెచ్. రజనీకాంత్ సన్మానించి, అభినందించారు.

**కాకతీయ పబ్లిక్ స్కూల్ హెడ్మాస్టర్ యం.డి. ఫరీదొద్దిన్ మాట్లాడుతూ,**

విద్యార్థులు ఆటలలో కూడా చక్కగా రాణించేలా నిరంతరం శిక్షణ ఇస్తున్నామని, విద్యార్థులు కూడా స్పోర్ట్స్ లో పట్టుదలతో శ్రమిస్తే ఏ రంగంలో నైనా రాణించగలరని, శ్రద్ధ, అంకిత భావం తో ప్రయత్నం చేస్తే తప్పక విజయం సాధిస్తారని అన్నారు.

స్పోర్ట్స్ కోటాలో అనేక అవకాశాలు విద్యార్థులు పొందవచ్చని, దానికి ప్రాక్టీస్ తోనే ముందుకు వెళ్ళాలని విద్యార్థులకు సూచించారు.

కాకతీయ విద్యాసంస్థల డైరెక్టర్స్ సి. హెచ్. రాజా, తేజస్విని, రామోజీ మాట్లాడుతూక్రీడల ద్వారా విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనవకుండా ఆరోగ్యంగా, ఆనందంగా ఉంటారని అన్నారు.

**ప్రిన్సిపల్ విజయలక్ష్మి మాట్లాడుతూ,**

పాఠశాలలో శిక్షణ, తల్లిదండ్రుల ప్రోత్సాహం రెండూ ఉంటే విద్యార్థులు ఇలాంటి విజయాలు తప్పక సాధిస్తారని, మిగతా విద్యార్థులు గణ్ రాజ్ ను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు.

# భారత వైమానిక దళంకు ఎంపికైన "సత్యశోధక్" పూర్వ విద్యార్థి.

**- అభినందించిన ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య.**




**వేగుచుక్క న్యూస్, సిరికొండ:**

భారత వైమానిక దళంకు సత్యశోధక్ పాఠశాల పూర్వ విద్యార్థి రావుట్ల జగదీష్ ఎంపిక అయ్యారు. దేశ రక్షణలో కీలకమైన వైమానిక దళంలో సేవలందించే అవకాశాన్ని పొందిన ఆయన విజయాన్ని పురస్కరించుకుని శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య ప్రత్యేక జ్ఞాపిక అందజేసి ఘనంగా సత్కరించి, అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థి తన కృషి, క్రమశిక్షణ, అంకితభావంతో భారత వైమానిక దళంలో స్థానం సంపాదించడం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. యువత తమ లక్ష్యాల సాధనకు నిరంతర శ్రమ, పట్టుదల మరియు దేశభక్తిని అలవర్చుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మరియు సిబ్బంది పాల్గొని జగదీష్‌ను అభినందించారు.

# ప్రవేట్ పాఠశాలల దోపిడినీ అరికట్టాలి

**షాపులుగా మారిన ప్రైవేటు పాఠశాలలు. ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలి. పిడిఎస్ యూ జిల్లా కమిటీ డిమాండ్.**




**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**

జిల్లాలో ప్రవేట్ పాఠశాలల దోపిడీని అరికట్టాలని పిడిఎస్ యు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ ఎస్.కిరణ్ కుమార్ కు పి డి ఎస్ యూ ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా పి డి ఎస్ యూ నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ మాట్లాడుతూ, జిల్లాలో ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు స్కూల్ ప్రాంగణంలో పుస్తకాలు, యూనిఫామ్స్, షూ, టై , బెల్ట్ అమ్ముతూ విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నారని, ఎమ్మార్పీ రేట్ల కంటే ఎక్కువ రేట్లకు అమ్ముతూ వేలాది రూపాయలు ముక్కు పిండి అడ్డగోలుగా వసూలు చేస్తున్నారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల బలహీనతలను ఆసరా చేసుకొని అడ్మిషన్ ఫీజు,ల్యాబ్ , రోబోటిక్, గేమ్స్ పేరుతో ప్రైవేట్ పాఠశాలలు లక్షలాది రూపాయలు దోపిడీ చేస్తున్నారనీ ఆరోపించారు. నిజామాబాద్ జిల్లాలో ఒక్కో పాఠశాలను బట్టి నర్సరీ నుండి పదవ తరగతి వరకు పదివేల నుండి 1,50,000 వరకు అడ్డగోలుగా ఫీజులు పెట్టి వసూలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు, ప్రైవేటు పాఠశాలలను తనిఖీ చేసి నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు యూనిఫామ్ అమ్ముకున్న వాటిపైన చర్యలు తీసుకోవాలి, ఫీజులను నియంత్రించడానికి ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యూ నగర అధ్యక్షులు సిర్రం పవన్ కుమార్, నాయకులు మనోజ్, శ్రీకర్, భవాని, అరవింద్, రాజు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి.

**అధికారులను ఆదేశించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి.**




**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, జూన్ 19 :**

ఓటరు జాబితాలో ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా సమగ్రంగా, పారదర్శకంగా రూపొందించేందుకు చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR)--2026 ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పురోగతిని సమీక్షించారు. బూత్ లెవల్ ఆఫీసర్లు, బూత్ లెవల్ ఏజెంట్లకు ఈ నెల 24వ తేదీలోగా శిక్షణ కార్యక్రమాలను పూర్తి చేయాలని సూచించారు. కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం జూన్ 25వ తేదీ నుంచి బీఎల్ఓ లు తమ పోలింగ్ కేంద్రాల పరిధిలో ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అక్టోబర్ 1వ తేదీన తుది ఓటరు జాబితా ప్రచురించే వరకు ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం అన్ని కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేలా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, షెడ్యూల్‌కు అనుగుణంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని సీ.ఈ.ఓ దృష్టికి తెచ్చారు. అన్ని స్థాయిల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించినట్లు వెల్లడించారు. ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు, జిల్లా స్థాయిలో మూడు దశలలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించామని అన్నారు.

బూత్ లెవల్ అధికారులకు శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేశామని, ఇంటింటి సర్వే సందర్భంగా బి ఎల్ ఓ లు నిర్వర్తించాల్సిన విధులు, బాధ్యతలపై సమగ్ర అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోపు ఎస్ఐఆర్ ప్రక్రియను సజావుగా పూర్తి చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ప్రీ మ్యాపింగ్ 87. శాతం పూర్తయ్యిందని తెలిపారు. 1565 పోలింగ్ కేంద్రాల పరిధిలో రాజకీయ పార్టీలు బీ.ఎల్.ఏ ల నియామకాలు పూర్తి చేశాయని, వారికి ఐ.డీ కార్డులు సమకూర్చాల్సిందిగా సూచించామని అన్నారు. కాగా, జిల్లాకు బీ ఎల్ ఓ కిట్లు కేటాయించాలని సీ.ఈ.ఓ ను కోరారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ భుజంగ రావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, బోధన్ ఆర్డీఓ విజయలక్ష్మి, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజు, ఏఈఆర్‌ఓలు పాల్గొన్నారు.

# కేంద్రానిది ఎప్పుడూ మొండివైఖరే

- కేసీఆర్ రైతులకు అండగా ధాన్యం కొనుగోళ్లు
- 12 వేల కోట్లు ధాన్యం కొనుగోళ్లకు కేటాయించారు
- మాజీ మంత్రి వేముల ప్రశాంతరెడ్డి



**నిజామాబాద్, జూన్ 19 :** ధాన్యం కొనుగోళ్లలో బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కూడా కేంద్రం కక్షపూరితంగా వ్యవహరించిందని, అయినా ఆనాటి సిఎం కెసిఆర్ ఏనాడూ రైతులకు అన్యాయం చేయలేదని, మాజీమంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. రైతులకు అండగా నిలిచి ఊరూరా కొనుగోలు కేంద్రాలతో పంటలు కొనుగోలు చేయించిన ఘనత కెసిఆర్‌దని అన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో ఉత్పత్తి అయిన మొత్తం ధాన్యంలో 3వ వంతు, ఇతర పంటల్లో 25శాతం కొనుగోలు చేయడం ఇప్పుడే అమలుచేసిన కొత్త విధానం కాదు. నాడు బీఆర్ఎస్ సర్కార్ హయాంలోనూ కేంద్ర ప్రభుత్వం ఇదే వైఖరిని అవలంబించింది. రాష్ట్రంలో రైతులు పండించిన పంటలను కొనుగోలు చేయబోమని అనేక ఇబ్బందులకు గురిచేసింది. ఒక దశలో అప్పటి సీఎం కేసీఆర్ ఏకంగా కేంద్ర ప్రభుత్వంపై తెలంగాణ రైతుల తరపున పెద్ద పోరాటమే చేశారు. అయినప్పటికీ కేంద్రం తెలంగాణ రైతుల పట్ల తన వివక్షను వీడలేదని గుర్తు చేశారు. ఉత్పత్తి అయిన మొత్తం పంటను కేంద్రమే కొనుగోలు చేయాలని తాము పోరాడామని అన్నారు. కేంద్రం నిరాకరించినా రాష్ట్రం ముందుకు వచ్చి ధాన్యం సేకించిందని వేముల అన్నారు. కానీ ప్రస్తు రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధం లేదని చెబుతున్నది. ఈ నేపథ్యంలో ఓ వైపు కేంద్రం 25శాతం పంటల్ని మాత్రమే కొనుగోలు చేయడం, మిగిలిన పంటను కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిరాకరిస్తుండటంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరకంగా మారింది. పంటల కొనుగోళ్లపై ఇటు రాష్ట్రం, అటు కేంద్రం చేతులెత్తేస్తుండటంతో మిగిలిన పంట పరిస్థితి ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు. మిగిలిన పంటను రైతులు ఎక్కడ అమ్ముకోవాలనే ప్రశ్నలు ఉత్పత్తి అవుతున్నాయి. బహిరంగ మార్కెట్లో విక్రయిద్దామంటే మద్దతు ధర దక్కే పరిస్థితి లేదు. తప్పని పరిస్థితుల్లో విక్రయించిన రైతులు నష్టాలు మూటగట్టుకుంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతువ్యతిరేక చర్యలతో ఆరుగాలం కష్టపడి పండించిన పంట ఉత్పత్తుల విక్రయం దైవాధీనంగా మారిందని అన్నారు. పెట్టుబడి పెట్టి పంటలు పండించిన రైతులు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. కేంద్ర సహాయ నిరాకరణతో రాష్ట్ర రైతుల కోసం నాడు కేసీఆర్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. కేంద్రం కొనుగోలు చేయని పంటలను రాష్ట్ర ప్రభుత్వం తన సొంత నిధులతో మొత్తం కొనుగోలు చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగానే కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చినా, ఇవ్వకపోయినా, కొనుగోలు చేసినా, చేయకపోయినా రైతులు పండించిన మక్కలు, జొన్నలు, కందులు, పెసర్లు, సోయాబీన్, శనగలు, సన్‌ఫ్లవర్ పంటలను రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేసింది. ఇందుకోసం ఏకంగా రూ.12వేల కోట్లను ఖర్చు చేసింది. ముఖ్యంగా కరోనా మహమ్మారి విజృంభించిన సమయంలో బహిరంగ మార్కెట్లో పంటలు కొనుగోలు చేసే దిక్కులేక రైతులు విలవిల్లాడిపోతే రాష్ట్ర ప్రభుత్వం సొంతంగా అన్ని పంటలను మొత్తం కొనుగోలు చేసి రైతులకు అండగా నిలిచిందని గుర్తు చేశారు. ప్రతిపక్షంలో ఉండగా పంటల కొనుగోళ్లపై కాంగ్రెస్ పార్టీ చేసిన రాద్ధాంతం అంతాఇంతా కాదన్నారు. కేంద్ర ప్రభుత్వం పంటలు కొనుగోలు చేయకపోతే రాష్ట్రం ప్రభుత్వం ఏం చేస్తుందని, రైతుల పంటలు కొనుగోలు చేసేందుకు కూడా పైసలు లేవా? అంటూ నాటి పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి ప్రశ్నించిన విషయం గుర్తు చేశారు. తాము అధికారంలోకి వస్తే ప్రతి పంటనూ మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని, అంతేకాదు.. మద్దతు ధరకు అదనంగా బోనస్ కూడా చెల్లిస్తామని ప్రకటించారు. తీరా అధికారంలోకి వచ్చిన రెండున్నరేండ్లలోనే పంటల కొనుగోళ్లపై చేతులెత్తేసిందని మండిపడ్డారు. నాడు పదేండ్ల పాటు రైతులకు ఇబ్బందుల్లేకుండా కేసీఆర్ పంటలు కొనుగోలు చేస్తే.. ఇప్పుడు రేవంత్ సర్కార్ రెండున్నరేండ్లకే తమ వల్ల కాదని చేతులెత్తేసిందని అన్నారు. ఉత్పత్తి చేసిన మొత్తం పంటలను కొనుగోలు చేయాలని, లేకుంటే రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చిరించారు.


# సమగ్ర పంటల విధానమే మేలు!



**దేశంలో పంటల విధానంపై సమగ్రత లోపించింది. రైతులు తమకు తోచిన పంటలు వేస్తున్నారు. ధరల కోసం దేబురిస్తున్నారు. ప్రభుత్వాలు వీలైనంత మేరకు కొంటున్నాయి. వీలుకాకపోతే చేతులెత్తేస్తున్నాయి. ముఖ్యంగా వరి, జొన్న, మక్కజొన్నలనే పండించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటికే దేశంలో ధాన్యం బాగా పోగయ్యింది. డిమాండ్ ఉన్న పంటలు వేయడం, సేంద్రియం వైపు మళ్లడంలో రైతులు ఇప్పటికీ వెనకడుగు వేస్తున్నారు. దీంతో సంప్రదాయ వరి పండిస్తూ చేతులు కాల్చుకుంటున్నారు. ఈ విధానం ముందుగా పోవాలి. ప్రభుత్వాలు కూడా రైతులను చైతన్యం చేయడం లేదా, ఫలానా పంటలు వేయండి అని చెప్పడం లేదు.**

తెలంగాణ రైతుల పరిస్థితి తీసుకుంటే ఇదే అర్థం అవుతోంది. సన్నాలు పండించిన వారికి గిట్టుబాటు ధరలు వస్తున్నాయి. మద్దతు ధరలను మించి కొంటున్నారు. తాజాగా మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మార్కెట్ యార్డులో సన్న వడ్లకు డిమాండ్ పెరిగింది. వరుసగా రెండ్రోజుల నుంచి 3వేలకు పైగానే మద్దతు ధరలు దక్కుతున్నాయి. ప్రభుత్వం కూడా సన్నాలు పండించాలని, ఏడు రకాలను తాజాగా గుర్తించింది. కానీ మండలాల వారిగా రైతులతో మాట్లాడి వారిని ఒప్పించి, రైతుల పంటల విధానంలో మార్పులు తీసుకుని రావాల్సి ఉంది.

# ఉదయపు అలవాట్లే నా బలం: సమంత



సినీ నటి సమంత తన జీవితంలో ఎదురైన మానసిక ఒత్తిడులు, ఆత్మన్యూనత భావాలను అధిగమించడంలో క్రమబద్ధమైన ఉదయపు దినచర్య కీలక పాత్ర పోషించిందని వెల్లడించారు. ఇటీవల అభిమానులతో ముచ్చటించిన ఆమె, తన రోజువారీ అలవాట్ల గురించి వివరించారు. ప్రతి రోజు ఉదయం 5.30 గంటలకు నిద్రలేస్తానని సమంత తెలిపారు. నిద్రలేచిన వెంటనే కృతజ్ఞతా డైరీ రాయడం తన మొదటి పని అని చెప్పారు. జీవితంలో లభించిన మంచి విషయాలను గుర్తు చేసుకుంటూ వాటిని డైరీలో నమోదు చేయడం వల్ల మనసుకు ప్రశాంతత లభిస్తుందని వివరించారు. అనంతరం కొద్దిసేపు ఎండలో గడుపుతానని, తర్వాత శ్వాస వ్యాయామాలు చేసి దాదాపు అరగంట పాటు ధ్యానం చేస్తానని పేర్కొన్నారు. ఈ అలవాట్లు తనలోని ప్రతికూల ఆలోచనలను తగ్గించి, మానసిక స్థైర్యాన్ని పెంచాయని చెప్పారు. ప్రతి వ్యక్తిలోనూ భయాలు, సందేహాలు, ఆత్మన్యూనత భావాలు సహజమేనని సమంత అభిప్రాయపడ్డారు. అయితే క్రమశిక్షణతో కూడిన జీవనశైలిని అలవాటు చేసుకుంటే వాటిని అధిగమించడం సులభమవుతుందని సూచించారు. తన అనుభవం ద్వారా ఈ విషయాన్ని తెలుసుకున్నానని తెలిపారు. ఇటీవల 'ట్యాపింగ్' అనే విధానాన్ని కూడా అనుసరిస్తున్నట్లు సమంత వెల్లడించారు. ఇది శరీరంలోని శక్తి సమతుల్యతను కాపాడటంతో పాటు మానసిక ఒత్తిడి, శారీరక నొప్పులను తగ్గించడంలో సహాయపడుతుందని చెప్పారు.



# వెంకీ-కళ్యాణ్‌రామ్ మల్టీస్టారర్‌కు శ్రీకారం

టాలీవుడ్‌లో మరో భారీ మల్టీస్టారర్ చిత్రానికి అధికారికంగా శ్రీకారం చుట్టారు. విజయవంతమైన దర్శకుడు అనిల్ రావిపూడి దర్శకత్వంలో విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్‌రామ్ హీరోలుగా తెరకెక్కనున్న ఈ ప్రతిష్ఠాత్మక చిత్ర పూజా కార్యక్రమాలు గురువారం హైదరాబాద్‌లో వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకకు ప్రముఖ దర్శకుడు కె. రాఘ వేంద్రరావు, ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్‌తో పాటు సినీ ప్రముఖులు హాజరై చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. చిత్రానికి సంబంధించిన కథానాయికల వివరాలను కూడా ఈ సందర్భంగా అధికారికంగా ప్రకటించారు. ఈ వినోదాత్మక కుటుంబ కథా చిత్రంలో వెంకటేష్ సరసన జాతీయ అవార్డు గ్రహీత కీర్తి సురేష్ నటించనుండగా, కళ్యాణ్‌రామ్‌కు జోడీగా యువ కథానాయిక కృతి శెట్టి కనిపించనుంది. ఇద్దరు హీరోలు, ఇద్దరు కథానాయికల కలయికతో సినిమా మరింత ఆసక్తికరంగా మారింది. చిత్రానికి జాతీయ అవార్డు గ్రహీత జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందించనున్నారు. షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ చిత్రానికి సురేష్ ప్రొడక్షన్స్, జీ స్టూడియోస్ సంస్థలు భాగస్వాములుగా వ్యవహరిస్తున్నాయి. అనిల్ రావిపూడికి బాగా కలిసొచ్చిన సంక్రాంతి సీజన్‌ను ఈ సినిమాకూ ఎంపిక చేశారు. 2027 సంక్రాంతి కానుకగా ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్మాతలు లక్ష్యంగా పెట్టుకున్నారు. దగ్గుబాటి, నందమూరి కుటుంబాల హీరోలు తొలిసారిగా కలిసి నటిస్తుండటంతో అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అనిల్ రావిపూడి ప్రత్యేక శైలిలో హాస్యం, కుటుంబ భావోద్వేగాలు, యాక్షన్ అంశాలు సమపాళ్లలో ఉండనున్నాయని సినీ వర్గాలు భావిస్తున్నాయి.



# దివి ఫొటోలు వైరల్ అభిమానుల ప్రశంసల వెల్లువ

బుల్లితెర రియాలిటీ షో 'బిగ్‌బాస్' ద్వారా తెలుగు ప్రేక్షకులకు చేరువైన నటి దివి వాద్య మరోసారి సోషల్ మీడియాలో చర్చనీయాం శంగా మారింది. తాజాగా ఆమె పంచుకున్న ఫొటోలు నెటిజన్లను ఆకట్టుకుంటూ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. స్టైలిష్ దుస్తులు, ఆత్మవిశ్వాసంతో కూడిన హావభావా లు, ఆకర్షణీయమైన ఫోజులతో కనిపించిన దివి చిత్రాలు అభిమానుల నుంచి విశేష స్పందనను అందుకుంటున్నాయి. 'బిగ్‌బాస్' కార్యక్రమం అనంతరం దివి కెరీర్‌లో గణనీయ మైన మార్పులు చోటుచేసుకున్నాయి. చిన్నచిన్న అవకాశాలతో ప్రారంభమైన ఆమె సినీ ప్రయా ణం ప్రస్తుతం వేగంగా ముందుకు సాగుతోంది. ముఖ్యంగా చిత్రంలో కనిపించి ప్రేక్షకుల దృష్టి ని ఆకర్షించిన దివి, ఆ తర్వాత వరుస అవకా శాలను అందిపుచ్చుకుంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపును ఏర్పరుచుకుంది. సినిమా లతో పాటు వెబ్ సిరీస్‌లు, బ్రాండ్ ప్రచార కార్యక్రమాలు, డిజిటల్ కంటెంట్ ద్వారా కూడా ఆమె తన ఉనికిని చాటుకుంటోంది. సామాజిక మాధ్యమాల్లో చురుకుగా ఉంటూ అభిమానులతో నిరంతరం మమేకమవుతోంది. తరచూ ఫొటోలు, వీడియోలు, వ్యక్తిగత అప్‌డేట్లను పంచుకుంటూ అనుచరుల సంఖ్య ను పెంచుకుంటోంది. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, నటిగా తన ప్రతిభను నిరూపించుకోవాలనే లక్ష్యంతో దివి విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటోంది.


# 'ది ఇండియా స్టోరీ' ఫస్ట్ లుక్ విడుదల

పముఖ నటి కాజల్ అగర్వాల్, నటుడు శ్రేయాస్ తల్పడే ప్రధాన పాత్రల్లో నటిస్తున్న పాన్ ఇండియా సామాజిక జాతీయతా నేపథ్య చిత్రం లిలి'ది ఇండియా స్టోరీ'లిలి ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. పోస్టర్ విడుదలైన వెంటనే సినీ ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది.

జీ స్టూడియోస్ సమర్పణలో ఎంబజీ ప్రొడక్షన్స్ అండ్ స్టూడియోస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. చెత్తన్ డీకే దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాకు సాగర్ బి. షిండే కథ, కథనం అందించడంతో పాటు నిర్మాతగా కూడా వ్యవహరిస్తున్నారు. సుమిత్ బగడే, అనితా జాదవ్, వినాయక్ సైదానీ, కల్పేష్ షా, దేవయాని ఖోరటే, ప్రేమ్ జోషి సహ నిర్మాతలుగా ఉన్నారు.




దేశంలో రోజురోజుకూ పెరుగుతున్న ఆహార కల్తీ, వ్యవసాయ రంగంలో రసాయనాలు, పురుగుమందుల అధిక వినియోగం వల్ల ఏర్పడుతున్న సమస్యలు, వాటి వెనుక ఉన్న అక్రమాల నేపథ్యంలో ఈ చిత్ర కథ రూపొందుతోంది. ప్రజారోగ్యాన్ని ప్రభావితం చేస్తున్న అంశాలను ప్రధాన కథాంశంగా తీసుకుని దర్శకుడు ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. బాంబే హైకోర్టు నేపథ్యంగా సాగే కోర్టు రూమ్ డ్రామాగా ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది. ఇందులో కాజల్ అగర్వాల్ శక్తివంతమైన న్యాయవాది పాత్రలో కనిపించ నుండగా, శ్రేయాస్ తల్పడే తన కుటుంబం కోసం పోరాడే ఆందోళ నలో ఉన్న తండ్రి పాత్రలో నటిస్తున్నారు.



# రాయ్ లక్ష్మీ వ్యాఖ్యలు మళ్లీ...

దక్షిణాది సినీ పరిశ్రమలో గ్లామర్ పాత్రలు, ప్రత్యేక గీతాలతో గుర్తింపు పొందిన ప్రముఖ నటి రాయ్ లక్ష్మీ మరోసారి వార్తల్లో నిలిచారు. గతంలో ఆమె చేసిన కొన్ని వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో మళ్లీ వైరల్ అవుతూ చర్చనీయాంశంగా మారాయి. సినీ రంగంలోకి అడుగుపెట్టిన తొలినా ళ్లలోనే తన అందం, నటనతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన రాయ్ లక్ష్మీ, తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో పలు చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు సంపాదించారు. కథానాయికగా నటించడమే కాకుండా పలు స్టార్ హీరోల చిత్రాల్లో ప్రత్యేక గీతాలతో కూడా విశేష ఆదరణ పొందారు. 2005లో విడుదలైన తమిళ చిత్రం ద్వారా సినీ రంగ ప్రవేశం చేసిన రాయ్ లక్ష్మీ, అనంతరం కన్నడ చిత్రాల్లో అవకాశాలు దక్కించుకుని తనకం టూ ప్రత్యేక స్థానం ఏర్పరుచు కున్నారు. తెలుగులో కూడా పలు చిత్రాల్లో నటించి ప్రేక్షకులను అలరించారు. అనంతరం అగ్ర హీరోల సినిమాల్లో ప్రత్యేక గీతాలతో మరింత ప్రజాదరణ పొందారు. సినీ జీవి తంతో పాటు ఆమె వ్యక్తిగత జీవితం కూడా గతంలో తరచూ వార్తల్లో నిలిచింది. ముఖ్యంగా భారత మాజీ క్రికెట్ జట్టు కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ తో తన పేరు ముడిపెట్టిన ప్రచారాలపై గతంలో ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె చేసిన వ్యాఖ్యలు అప్పట్లో పెద్ద చర్చకు దారితీశాయి.